# అందగత్తె

## కొల్లూరి సోమశంకర్

ఆమె దగ్గర ఆటోగ్రాఫ్ తీసుకోవాల్సివస్తుందని రూప అసలేమాత్రం ఊహించలేదు. రూప ఈ సంవత్సరపు మిస్ ఇండియా. మరి ఆమె చిక్కటి నలుపు, ఎత్తైన ముక్కుతో చాలా అనాకారిగా ఉంటుంది. మరి ఆవిడతో రూప పరిచయం ఎలా జరిగిందంటే...

ఇటీవల జరిగిన మిస్ ఇండియా పోటీలలో విజేతగా నిల్చిన రూప పూర్తిపేరు రూప లావణ్య. వాళ్ళ సొంత ఊరు విజయనగరం. రూప 6వ తరగతి చదువుతూండగా, తండ్రి రాజేశ్వర్ ఢిల్లీలో స్థిరపడిపోవడంతో, ఆమె ఢిల్లీ నివాసి అయిపోయింది. అక్కడ ఆమె ఆధునిక విద్యతో పాటు, కాస్మోపాలిటన్ సంస్కృతిని అలవర్చుకుంది. ప్రస్తుతం ఓ సుప్రసిద్ధ కాలేజీలో డిగ్రీ ఆఖరి సంవత్సరం చదువుతోంది. డబ్బుకి లోటు లేకపోవడంతోను, సంపూర్ణమైన స్వేచ్ఛ ఉండడంతోను, చుట్టూ స్నేహితురాళ్ళతో రూప ఓ చైతన్య ప్రవంతిలా ఉంటుంది. దేశం గర్వించే ఘనత ఏదైనా సాధించాలనేది ఆమె లక్ష్యం.

డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్నప్పుడు ఓ పత్రికలో వచ్చిన ప్రకటన ఆమె దృష్టిని ఆకర్షించింది. అది మిస్ ఇండియా పోటీలకి సంబంధించినది. అప్పట్నుంచి రూప ఓ ఫ్యాషన్ ఇన్‌స్టిట్యూట్‌లో చేరింది. నటన, వ్యాయామం, ఈత వంటి అన్ని అంశాలలోను శిక్షణ పొందసాగింది. దుస్తులు, కేశాలంకరణ, మేకప్ వంటి విషయాలలోను, న్యాయనిర్ణేతల ప్రశ్నలకు తగిన సమాధానాలు చెప్పడంలోను ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. మామూలుగానే అందంగా ఉండే రూప, ఇప్పుడు అదనపు హంగులతో మరింత ఆకర్షణీయంగా తయారైంది.

సంవత్సరకాలం ఇట్టే తిరిగింది. ఈ ఏడాది మిస్ ఇండియా పోటీలకి ప్రకటన రాగానే రూప కూడా దరఖాస్తు చేసింది. వేలాదిగా వచ్చిన దరఖాస్తుల్లోంచి 200 మంది దరఖాస్తులను నిశితంగా పరిశీలించి, వాటిల్లోంచి 26 దరఖాస్తులను పోటీకి పరిగణనలోకి తీసుకున్నారు నిర్వాహకులు. రూప అన్ని వడపోతల్లోను నెగ్గి పోటీలలో పాల్గొనడానికి తగిన అర్హత సాధించింది.

పోటీలకు వచ్చిన ఒక న్యాయనిర్ణేత రూపని అడిగారు "అందమంటే ఏమిటి?" అని.

"అందానికి ఎన్నో నిర్వచనాలు ఉన్నాయి. నా దృష్టిలో అందమంటే లావణ్యం, మేధస్సుల కలబోత" చెప్పింది.

"మిస్ ఇండియాగా ఎన్నికైతే ఏ విధంగా ప్రతిస్పందిస్తావు?" అని మరో న్యాయనిర్ణేత అడిగారు.

"నాపై నా నమ్మకం నిజమైనందుకు గర్వపడతాను. నా తల్లిదండ్రులకు, మా ఊరికి కీర్తిప్రతిష్ఠలు తెచ్చిపెట్టినందుకు సంతోషిస్తాను" అని చెప్పింది రూప.

ఫలితాలు ప్రకటించారు. మిస్ ఇండియాగా రూప గెలుపొందింది. మిస్ ఇండియాగా ఎంపికైన మొదటి తెలుగమ్మాయిగా రూప చరిత్ర సృష్టించింది. మిస్ యూనివర్స్ పోటీలలో పాల్గొనడానికి సిద్ధమవసాగింది.

రూప సొంత ఊరు విజయనగరంలో ఆమె పేరు మారుమోగిపోయింది. ఆమెకి బాబాయి వరసయ్యే ఒకాయన విజయనగరంలో జరిగే రెండు కార్యక్రమాలలో పాల్గొనాల్సిందిగా రూపకి ఆహ్వానం పంపారు.

బంధుత్వమనో, లేదా చిన్ననాటి స్నేహితులను కలుసుకోవచ్చనో ఆ ఆహ్వానాన్ని మన్నించింది రూప.

రూప తన సన్నిహితులైన ఇద్దరు ముగ్గురు మిత్రురాళ్ళతో కలిసి విమానంలో విశాఖపట్నం చేరింది. అక్కడ్నించి ఆమెను జీపులో ఊరేగింపుగా విజయనగరం తీసుకువచ్చారు నిర్వాహకులు. అదే సమయంలో పట్టణంలో 'విజయనగర ఉత్సవాలు' జరుగుతున్నాయి.

వీటిలో భాగంగా చిత్రకళా ప్రదర్శనను రూప ప్రారంభించింది. తర్వాత రెండు రోజుల పాటు విజయనగరం కోట, సంగీత కళాశాల, గురజాడ అప్పారావుగారి ఇల్లు, పట్టణానికి కొంచెం దూరంలో ఉన్న బొబ్బిలి కోట, రామతీర్థం గుడి, తొట్లకొండలోని బౌద్ధస్థూపాలు వంటి పర్యాటక ప్రదేశాలను చూసారు. మూడో రోజు రాత్రి రూపకి, ఆమె మిత్రబృందానికి హోటల్ మయూరలో డిన్నర్ ఏర్పాటు చేశారు నిర్వాహకులు. ఐటమ్స్ ఆర్డరిచ్చి అందరు కబుర్లు చెప్పుకుంటూ, జోకులు వేసుకుంటూ ఉత్సాహంగా ఉన్నారు.




ఇంతలో ఆ ఏ.సి. గదిలోకి కొంతమంది వచ్చి వారికి కేటాయించి ఉన్న కుర్చీల్లో కూర్చుని, వారికి కావల్సిన పదార్థాలు ఆర్డర్ చేయసాగారు. వాళ్ళల్లో ఒకావిడ అందరి కంటే భిన్నంగా ఉంది. ఆమె వయసు సుమారుగా 35-40 ఏళ్ళమధ్య ఉండవచ్చు. రంగు చిక్కటి నలుపు. ఏదో ముదురురంగు చీరకట్టుకుని ఉంది.

అయితే ఆమె ముఖంలో మాత్రం ఏదో ఆకర్షణ ఉంది. మానసికంగా ప్రశాంతతను అనుభవించే మనిషి ముఖంలో ఉండే కళ ఆమెలో ప్రస్ఫుటంగా ఉంది.

ఇంతలో రూప, ఆమె స్నేహితురాళ్ళ దృష్టి ఆమెపై పడింది. అంతే ఒక్కసారిగా వాళ్ళ పెదాలపై హేళనతో కూడిన నవ్వులు విరిశాయి. "ఆమెను చూడండే...ఆ కాంప్లెక్షన్, ఆ చీర...గొప్ప అందగత్తె" అంటూ గుసగుసలాడింది ఓ అమ్మాయి. కాసేపు వీళ్ళ సంభాషణకి కేంద్ర బిందువు అయ్యిందామె.

ఇంతలో ఆమెకి ఎలా తెలిసిందో ఏమో, లేచి రూప దగ్గరికి వచ్చి, "కంగ్రాట్స్! మీరు మిస్ యూనివర్స్‌గా కూడా గెలవాలి" అని అంటూ ఆటోగ్రాఫ్ తీసుకుంది. రూపకి కించిత్ గర్వం కలిగింది.

మర్నాడు ఉదయం జిల్లా కలెక్టర్ పాల్గొనే ఒక కార్యక్రమంలో రూప పాల్గొనాలి. ఇదే ఆమె ఆఖరిసభ. రూప, జిల్లా కలెక్టర్, కొంతమంది పెద్దలు వేదికపై ఆశీనులయ్యారు. ఇంకా ఒక కుర్చీ ఖాళీగా ఉంది.

సభాధ్యక్షుడు మాట్లాడుతూ "ఉత్తరాంధ్రలో పోలమాంబగారి పేరు తెలియనివారు లేరు. తన యావదాస్తిని సమాజానికి ధారాదత్తం చేశారామె. మన ప్రాంతంలో స్వయం సహాయక బృందాలు స్థాపించి స్త్రీలకు మేలు చేశారామె. బాలకార్మిక వ్యవస్థను రూపుమాపడానికి కృషి చేస్తున్న ఆవిడకి యు.ఎన్.డి.పి. అవార్డు రావడం మనకు ఎంతో గర్వకారణం. పోలమాంబ గారిని సగౌరవంగా వేదికపైకి ఆహ్వానిస్తున్నాము" అన్నారు.

వేదికపైకి వస్తున్న ఆవిడని చూడగానే రూప నిర్ఘాంతపోయింది. ఆమె ఎవరో కాదు, నిన్నరాత్రి హోటల్లో ఎవరిని చూసి తామంతా నవ్వుకున్నారో ఆమే ఈవిడ!

వక్తలు పోలమాంబగారిని పొగుడుతున్నారు. ఒకావిడ యు.ఎన్.డి.పి. అవార్డు పొందడం ఎంత కష్టమో వివరిస్తూ, దాన్ని పోలమాంబగారు సాధించడం ఆంధ్రరాష్ట్రానికే గర్వకారణమని అన్నారు. పోలమాంబగారు చిరునవ్వుతో వినమ్రంగా ఉండిపోయారు. చివరగా కలెక్టరుగారు మాట్లాడుతూ పోలమాంబగారు సమాజానికి మరింత సేవచేసి, మరిన్ని అవార్డులు పొందాలని కోరారు.

ఆ క్షణంలో రూపకి అందానికి మరో నిర్వచనం స్ఫురించింది. అందమంటే...దయ, నిస్వార్థం, త్యాగం! కార్యక్రమం ముగుస్తుండగా, రూప లేచి పోలమాంబగారి దగ్గరకి వెళ్ళి ఆటోగ్రాఫ్ అడిగింది.